సాక్షి
పెద్దపల్లి

గురువారం ꠰ 4 ꠰ ఏప్రిల్ ꠰ 2024

ఎంటీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా తిరుమల



గోదావరిఖని: మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ(ఎంటీఆర్ఎస్) పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా మేకల తిరుమల పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు అశోక్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా॥)	సహర్ శుక్ర(ఉ॥)
కరీంనగర్	6.28	4.38
పెద్దపల్లి	6.35	4.45
రాజన్న సిరిసిల్ల	6.35	4.46
జగిత్యాల	6.35	4.45

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4/26.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఎల్లంపల్లి'లో ఏడు టీఎంసీలు



రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. బుధవారం నీటి పారుదలశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రస్తుత నీటిమట్టం 142.16 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 7.66 టీఎంసీలకు పడిపోయాయి. హైదరాబాద్ ప్రజలకు 308 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో ఏమీ లేదు. పార్వతీ బ్యారేజీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 8.83 టీఎంసీలుగాకాగా ప్రస్తుతం 1.02 టీఎంసీలు ఉన్నాయి.

పత్తి ధర రూ.7,557

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.7,557 పలికింది. కనిష్ట ధర రూ.6,255, సరాసరి ధర రూ.7,421గా నమోదైంది.

తాలు లేకుండా తేవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రవీందర్

ఓదెల(పెద్దపల్లి): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్ సూచించారు. ఓదెల, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోతలు లేకుండానే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని వివరించారు. డీపీఎం రవి, ఏపీఎం లతామంగేశ్వరి, సీసీలు మారెల్లి శ్రీనివాస్, రాజకుమారి, విజయ, స్వశక్తి మహిళలు తూడి స్వప్న, రజిత, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమా నాయక్ బుధవారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నియమావళి తదితర అంశాలపై వివరించారు. లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ తదితర వ్యవహారాల నిర్వహణకు బృందాలను నియమించినట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించాలి

రామగుండం: గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆదర్శ పాఠశాలల్లో స్వయం సహాయక సభ్యులతో ఆదర్శ అమ్మ కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై బుధవారం సమీక్షించారు. ప్రజలు ఎండ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో అలీం, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, డీఈ సునీల్, మండల పంచాయతీ అధికారి అబ్దుల్ వాజీద్, వ్యవసాయాధికారి బూక్య రాంబాబు, ఏపీవో రమేశ్ పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితోనే తెలంగాణ సాధించాం



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలిఅమరుడు దొడ్డి కొమురయ్య పెత్తందారి వ్యవస్థపై పోరాటం చేశారని, ఇలాంటి ఎందరో మహనీయుల స్ఫూర్తితోనే ఉద్యమించి తెలంగాణ సాధించుకున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం రాదనేది గత ఎన్నికల్లో నిరూపణ అయ్యిందన్నారు. మహనీయుల స్ఫూర్తితో నియోజకవర్గంలో బలహీనవర్గాలకు రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు



- ఈ ఎండిన వరి పొలం మంథని మండలం సూరయ్యపల్లి శివారులోనిది. మంథని మండలంలో సుమారు 20,627 ఎకరాల్లో వివిధ పంటలు వేయగా, ఇందులో వరి 20,603 ఎకరాల్లో సాగైంది. కాలువ నీటి ఆధారంగానే ప్రధానంగా సాగు చేస్తారు. ఎస్సారెస్పీ డీ–83 కాలువ కింద సాగు చేసే కాకర్లపల్లి, సూరయ్యపల్లి, బిట్టుపల్లి, ఉప్పట్ల, గుంజపడుగు శివారులోని దాదాపు రెండువేల ఎకరాల ఆయకట్టు నీరు అందక ప్రశ్నార్థకరంగా మారింది. పొలాలు పగుళ్లు చూపి పంటలు చేతికిరాకుండా పోయాయి. మంథని శివారులోని అంగుళూర్, మల్లెపల్లి ఆయకట్టుకు మరోవారం రోజులు నీరు అందితే పంటలు చేతికొచ్చే అవకాశం ఉంది. లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.



- ఈచిత్రంలో ఎండిపోయి కనిపిస్తున్న పొలం ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందినది. ఈ గ్రామాల్లోని పంటలకు నీరు అందించేందుకు ఎస్సారెస్పీ డీ–83 బీ కాలువ ద్వారా సరఫరా చేస్తారు. ముందుగా మల్లాపూర్ గ్రామ శివారులోని కుంటలో నీరు నింపి.. అక్కడి నుంచి ఉపకాలువల ద్వారా ఈ గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తారు. సోమవారం కుంటలోకి నీరు చేరినా.. పూర్తిస్థాయిలో నీరు నిండక, ఉప కాలువలు పూర్తిస్థాయిలో పూర్తిచేయకపోవడంతో సాగు నీరు అందక.. కెనాల్‌పై ఆధారపడి వరి సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయి.



- పశువుల మేతగా మారిన ఈ వరి పొలం ముత్తారం మండలంలోనిది. వివిధ గ్రామాల్లో 10,721 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎస్సారెస్పీ డీ–83 కాలువ, మానేరు, బోర్లు, బావులు పంటకు ఆధారం. ఇప్పలపల్లి, సీతంపల్లి, ఖమ్మంపల్లి చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ డీ– 83 కాలువ, గుండారం రిజర్వాయి నుంచి బేగంపేట చెరువు ద్వారా సాగునీరు అందిస్తారు. కాలువ నీళ్లు అందక పంటలు ఎండిపోయాయి. పంటను పశువులకు మేతకు వదిలేశారు. మానేరులోనూ నీరు అడుగంటి బావులు, బోర్లు ఎత్తిపోయాయి.

జిల్లాలో కరువు కోరలు!

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- పొట్టదశలో ఎండుతున్న 'వరి' పంట



పశువులకు మేతగా మారిన ఓదెలలోని వరి పంట



తాలుగా మారిన కాల్వశ్రీరాంపూర్‌లోని గంగారం ప్రాంతంలోని వరి పంట

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వాటి ధాటికి కుంటలు, చెరువులు, బోరుబావులు, రిజర్వాయర్లే కాదు.. ప్రాజెక్టుల్లోని నీరు కూడా ఆవిరైపోతోంది. పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్నాయి. వాటిని చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కళ్లెదుటే శ్రమంతా ఆవిరైపోతూ ఉంటే.. ఎలా కాపాడుకోవాలో తెలియక కన్నీటిపర్యంతమవుతున్నారు.

వరి పంటదే అగ్రస్థానం..

- జిల్లాలో ఈ యాసంగిలో అధిక మొత్తంలో వరి పంట సాగు చేశారు.
- దీనికి నీటి వినియోగం అధికం కావడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి.
- ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తున్నా చివరి ఆయకట్టుకు అందక ఎండిన పంటలు పశువులకు మేతగా మారుతున్నాయి.
- మరోవారం పాటు ఇదే పరిస్థితి కొనసాగితే.. జిల్లా కరువు కోరల్లో చిక్కుకోవడం ఖాయమని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రధానంగా మంథని, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో నీళ్లు అందక వివిధ పంటలు ఎండి, దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడులు చేతికి రాలేని పరిస్థితుల్లో రైతులు చిక్కుకుపోతారు.

వరితోనే గోస..

జిల్లాలో ఈయాసంగిలో సుమారు 2.14లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో అత్యధికంగా 1.98లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ పంటకు నీటి వినియోగం అధికం కావడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు.. ఎండల ధాటికి వ్యవసాయ బావులు, బోరు మోటార్లు వట్టిపోతున్నాయి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీరు తగ్గుముఖం పడుతోంది. దీంతో పొట్టదశకు చేరుకున్న వరి పొలాలు తాలుగా మారుతున్నాయి.



కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు(0.08 టీఎంసీలు). ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వేసిన పైపులైన్ ద్వారా గతనెల 31నుంచి రిజర్వాయర్‌లోకి నీళ్లు తరలిస్తున్నారు. సుమారు 2 టీఎంసీలు దీనికోసం కేటాయించారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 10.6 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయిలో నిండితే దిగువకు నీళ్లు వదులుతారు. మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారంలోని దాదాపు 36వేల ఎకరాల ఆయకట్టు దీనిఆధారంగా సాగవుతోంది. మరోమూడు రోజుల పాటు ఎల్లంపల్లి నుంచి నీరు రిజర్వాయర్‌లోకి సరఫరా చేసి, ఆ తర్వాత పంటలకు అందిస్తామని డీఈ తెలిపారు. అయితే, ఎల్లంపల్లిలో 20.175 టీఎంసీలకు 7.66 టీఎంసీల నీరే నిల్వ ఉంది. ఇక్కడి నుంచే హైదరాబాద్, పెద్దపల్లి, మంచిర్యాలకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గుండారంలో పూర్తిస్థాయి నీళ్ల నింపడం, దిగువకు విడుదల చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిజర్వాయర్ నుంచి నీళ్ల వదిలి తమ పంటలు కాపాడాలని అధికారులకు విన్నవించేందుకు రైతులు ఇలా సమావేశమయ్యారు.

పశువులకు వదిలేసిన



బావి పారకం కింద ఐదెకరాల్లో వరి ఏసిన. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టిన. ఎండలకు బావుల్లో నీళ్లు ఎండిపోయినయి. పంట ఎండిపోయింది. ఎడ్ల మేతకు వదిలేసిన.

– మినుగు స్వరూప, ఓదెల

తాలే మిగిలింది



హుస్సేన్‌మియా వాగొడ్డున నాకున్న నాలుగెకరాల్లో వరి ఏసిన. కాలువ నీళ్లు వస్తయనే ఆశతో లక్ష రూపాయల వరకు ఖర్చుపెట్టిన. నీళ్లందక రెండెకరాల్లో పంట ఎండింది. ఈనిన పొలం తాలైంది. 11 కోలల బావి అడుగంటింది. మరో 40,000 ఖర్చు చేసి క్రేన్‌తో పూడిక తీయించిన. అయినా నీటి చుక్క రాలేదు. పంట ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదు.

– సిరువంచ రవి, గంగారం

కాళేశ్వరాన్ని సాకుగా చూపుతున్నారు..

- పంటలు ఎండపెడుతున్నారు
- జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

సాక్షి, పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు డ్యామేజీని సాకుగా చూపి లక్షల ఎకరాల్లోని పంటలను ఎండబెడుతున్నారని, రైతులు ఆత్మహత్య చేసుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మండిపడ్డారు. స్థానిక బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద ప్రాజెక్టులు నిర్మిస్తే చిన్న సమస్యలు రావడం సహజమన్నారు. బ్యారేజీలో 11 బ్లాక్‌లు ఉండగా, అందులో ఒక్క బ్లాక్‌లోని ఒక పిల్లర్‌కే డ్యామేజీ జరిగిందని తెలిపారు. అయినా, పిల్లర్ వద్ద రింక్‌బండలు, ఇసుక బస్తాలు వేసి నీటిని ఎగువకు డంప్ చేయవచ్చన్నారు. అలా చేయకుండా పంటలు నష్టపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలకు కారణమైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు 8 వేల మంది రైతులకు రైతుబంధు జమకాలేదని పేర్కొన్నారు. రైతుల పక్షాన ఇప్పటికే 36గంటలపాటు నిరసన దీక్ష చేశామని, నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.25వేల చొప్పున, ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కజొన్న



ధూళికట్ట శివారులో ఎండుతున్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్ట ఎల్లమ్మ ఆలయం నుంచి వడుకాపూర్ రోడ్డు వెంట వడుకాపూర్, ధూళికట్టకు చెందిన రైతులు దాదాపు 30ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. పంట ప్రస్తుతం కంకిదశకు చేరింది. దీనికి ఎస్సారెస్పీ నీరే ఆధారం. రెండు రోజుల క్రితం వరకు సాగునీరు వచ్చింది. ఇదే చివరి తడి అని అధికారులు చెబుతున్నారు. కానీ, ఇంకో రెండు తడులు అందిస్తే పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకి రూ.40వేల పెట్టుబడి పెట్టామని, కౌలు రైతులు అదనంగా రూ.30వేల వరకు కౌలు చెల్లించారని వివరించారు. పంట ఎండిపోతే నిండా మునుగుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు వేల్పుల రమేశ్ మూడెకరాలు, రేచవేని సమ్మయ్య రెండెకరాలు, వేల్పుల ఓదెలు రెండెకరాలు, రైతులు ఆసంపల్లి లక్ష్మీనారాయణ మూడెకరాలు, లింగంపల్లి ఎల్లమ్మ 1.32 ఎకరాలు, లింగంపల్లి అంజయ్య 1.32 ఎకరాలు, కాశెట్టి భూమయ్య మూడెకరాల్లో మొక్కజొన్న వేశారు. రెండు తడులు ఇస్తే పంట చేతికి వస్తుందని అంటున్నారు.

ఉత్సాహంగా 5కే రన్

పెద్దపల్లిరూరల్: ఓటరు అవగాహనపై జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టిన 5కే రన్‌ను ఆర్డీవో గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ ప్రారంభించారు. 18ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా జాబితాలో పేరు నమోదు చేసుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తిచేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. తొలిదశలో అసెంబ్లీవారీగా కేటాయించి, మలిదశలో రిటర్నింగ్ అధికారి పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయిస్తారని కలెక్టర్ వివరించారు. పెద్దపల్లి సెగ్మెంట్‌పరిధిలో 290, మంథని పరిధిలో 290, రామగుండం పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఈడీఎం కవిత, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

6లోగా భూసేకరణ ప్రతిపాదనలు ఇవ్వండి

పెద్దపల్లిరూరల్: వరంగల్ – మంచిర్యాల మధ్య ఫోర్‌లేన్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రతిపాదనలను ఈనెల 6వ తేదీలోగా సమర్పించాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూసేకరణపై సమీక్షించారు. జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూసేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. 455 మంది రైతులు భూములు కోల్పోయే అవకాశం ఉందని, వారికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం రూ.36కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. నిర్వాసిత రైతుల పూర్తి వివరాలను సేకరించి వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆర్డీవో హనుమా నాయక్, డీఎఫ్‌వో శివయ్య, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

- అప్రమత్తంగా ఉంటే నియంత్రణ సాధ్యమే
- వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి
- 'సాక్షి'తో ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్



పెద్దపల్లిరూరల్: 'అప్రమత్తంగా ఉంటే వేసవిలోనూ అగ్నిప్రమాదాలు నియంత్రించే వీలుంది. ప్రస్తుతం నిర్లక్ష్యంతోనే అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా రైతులు వరికొయ్యలకు నిప్పు పెట్టడం, వ్యాపారులు దుకాణాలు మూసివేశాక విద్యుత్ సరఫరా నిలిపివేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి' అని పెద్దపల్లి అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి అగ్నిమాపక శాఖ పరిధిలో గతేడాది 62 ప్రమాదాలు చోటు చేసుకోగా దాదాపు రూ.7కోట్ల వరరరకు ఆస్తినష్టం సంభవించిందని పేర్కొన్నారు. 'సాక్షి'తో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

సాక్షి: అగ్నిమాపక కేంద్రంలో సౌకర్యాలు ఉన్నాయా?

ఫైర్‌ఆఫీసర్: పెద్దపల్లిలోని అగ్నిమాపక కేంద్రంలో వసతులు మెరుగ్గానే ఉన్నాయి.

సాక్షి: సరిపడా సిబ్బంది ఉన్నారా?

ఫైర్‌ఆఫీసర్: పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రంలో 16మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 10మంది పనిచేస్తున్నారు. మరో ఆరుగురు నియామకమైనా.. వారు శిక్షణలో ఉన్నారు.

సాక్షి: ఫైరింజిన్ కండిషన్‌లోనే ఉందా?

ఫైర్‌ఆఫీసర్: ప్రస్తుతానికి వాహనం నడుస్తోంది. కొత్త వాహనం కావాలని ప్రతిపాదించాం. వీలైనంత త్వరలో వచ్చే అవకాశం ఉంది.

సాక్షి: ప్రమాదాలు సంభవించినపుడు మంటలను ఆర్పేందుకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా..?

ఫైర్‌ఆఫీసర్: అగ్నిప్రమాదాల్లో మంటలను నియంత్రించేందుకు నీటికి ఇబ్బందుల్లేవ్. వ్యవసాయ బావులు, మున్సిపల్ బావుల్లో నుంచి అవసరమైనపుడు నీటిని తీసుకుంటున్నాం.

సాక్షి: ఈ ప్రాంతంలో ఎక్కువగా ఎలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి?

ఫైర్‌ఆఫీసర్: పెద్దపల్లి ప్రాంతంలో రైతులు వరి పైరు కోయగానే కొయ్యలను కాల్చుతున్నారు. వాటితో ప్రమాదాలు జరుగుతున్నాయి. గడ్డివాములు, గుడిసెలు కాలుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నిప్పు పెట్టిన రైతులే ఆ మంటల్లో మరణించారు కూడా.

సాక్షి: పట్టణ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు మీరు తీసుకున్న చర్యలేమిటి?

ఫైర్‌ఆఫీసర్: పట్టణ ప్రాంతాల్లో కొద్దిరోజుల క్రితం వాణిజ్య సముదాయంలో అగ్నిప్రమాదం జరిగింది. మూడు దుకాణాలు కాలిపోయాయి. వ్యాపారులు దుకాణాలను మూసేటపుడు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడం మంచిది.

సాక్షి: ఎండాకాలంలో అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఫైర్‌ఆఫీసర్: వేసవిలో అగ్ని ప్రమాదం జరిగితే నష్టం అధికంగా ఉంటుంది. కానీ ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉంటే అసలు అగ్నిప్రమాదాలే జరగవు. రైతులు వరికొయ్యలను నిర్లక్ష్యంగా కాల్చొద్దు. వ్యాపారులు దుకాణాలు మూసివేశాక విద్యుత్ సరఫరా నిలిపేయాలి. మహిళలు పూజామందిరంలో దీపాలు కొండెక్కే దాకా పర్యవేక్షించాలి.

సాక్షి: అగ్నిప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారా?

ఫైర్‌ఆఫీసర్: ఏటా అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. జిల్లాకేంద్రమైన పెద్దపల్లిలోనూ వ్యాపార, వాణిజ్య సంస్థలు, పెట్రోల్‌బంకుల్లో ప్రమాదాల నియంత్రణకు పాటించాల్సిన పద్ధతులపై ప్రదర్శనలిస్తూ అవగాహన పెంచుతున్నాం.



పెద్దపల్లిలోని ఓ కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు



కమాన్ చౌరస్తా సమీపంలో..



డ్రైనేజీలో చేరుతున్న తాగునీరు



నీరురాక నిరుపయోగమైన చేతిపంపు

తాగునీటి వృథా

బొట్టుబొట్టు ఒడిసిపట్టుడేమోకానీ.. తాగునీటి వృథాను అరికట్టలేకపోతున్నారు అధికారులు. వేసవిలో తలెత్తే సమస్యను అంచనా వేయలేక తాగు, సాగునీరు అందించడం ఎలా? అని ప్రభుత్వం తికమకపడుతోంది. అయినా, తమకేమీ పట్టనట్లు మిషన్‌భగీరథ అధికారుల తీరు ఉంది. పెద్దపల్లిలోని పలు వీధుల్లో మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ నిర్మించిన పైపులైన్లు.. లీకేజీలతో తాగునీరు వృథాగా పోవడం వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. అధికారులు ఇకనైనా స్పందిస్తారని ఆశిస్తూ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది పందికుంటపల్లి


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి ప్రభాకర్

రామడుగు(చొప్పదండి): అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది రామడుగు మండలంలోని పందికుంటపల్లి. దేశాలు వేరైనప్పటికీ ప్రేమ అనే బంధం ఇరువురినీ ఒక్కటి చేసింది. పందికుంటపల్లికి చెందిన కట్కం సురేందర్ ఉద్యోగం చేయడానికి లండన్ వెళ్లాడు. తాను పని చేస్తున్న ఆఫీస్‌లో శ్రీలంక దేశానికి చెందిన జానుషికతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారడంతో తమ కుటుంబసభ్యులను పెళ్లికి ఒప్పించారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏడడుగులు వేశారు. వివాహానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భూ కబ్జాపై ఎస్పీకి ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: అధికారి పార్టీ అండ చూసుకొని మాజీ సర్పంచ్ తన భూమి కబ్జా చేశాడని ఓ వ్యక్తి బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన మెండె గంగయ్యకు అతను ఇల్లు కట్టుకున్న ఏరియాలో 16 గుంటల భూమి ఉంది. మంగళవారం ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జలపతి ఆ భూమిలోకి చొరబడి, గంగయ్యను కొట్టి, చంపుతానని బెదిరించి, తెల్ల కాగితంపై సంతకం తీసుకున్నాడు. అధికార పార్టీ నాయకుడినని, ఎమ్మెల్యే పేరు చెప్పి, భూమి ఆక్రమించాడని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు బాధితుడు తెలిపాడు.

శ్రీజ అత్తింటివారి అరెస్టు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పంచాయతీ పరిధి విజయ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీజ, ఆమె కుమారుడు రేయాన్స్, తల్లి జయప్రద ఆత్మహత్య కేసులో శ్రీజ అత్తింటివారిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆమె తండ్రి గద్దె వెంకటేశ్వరాచారి ఫిర్యాదు మేరకు శ్రీజ భర్త నరేశ్, అత్తామామ సుజాత-కేశవాచారిలపై కేసు నమోదు చేశామన్నారు. బుధవారం వారిని అరెస్టు చేసి, జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయి మాయంపై కొనసాగుతున్న విచారణ

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ పోలీసులు సీజ్ చేసిన గంజాయి పోలీస్‌స్టేషన్ నుంచి మాయమైన ఘటనపై విచారణ కొనసాగుతోంది. గతంలో గంజాయి తరలింపులో నిందితులుగా ఉన్నవారిని, కొత్తగా అనుమానిస్తున్న వారిని మూడోరోజు బుధవారం విచారించారు. 70 కిలోల గంజాయి ప్యాక్ చేసిన సంచులను ఠాణా నుంచి ఏదైనా వాహనంలో తరలించి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై పలు కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు తెలిసింది.

ఆవుకు రెండు దూడలు



ధర్మపురి: ధర్మపురివాసి భారతపు సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవు బుధవారం ప్రసవ వేదనతో అల్లాడిపోయింది. పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, సహజ ప్రసవం చేశారు. ఆ ఆవు రెండు దూడలకు జన్మనివ్వడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు. పశువులు కవలలకు జన్మనివ్వడం చాలా అరుదని, మూడు జీవాలూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

వెల్గటూర్‌లో మట్టి దందా

- రెవెన్యూ అధికారులు, పోలీసుల జాయింట్ ఆపరేషన్‌తో వెలుగులోకి..
- టిప్పర్, లారీలు, జేసీబీ వదిలేసి, పారిపోయిన డ్రైవర్లు
- రూ.కోట్ల స్కాంపై చర్యలు తీసుకోవాలి : విప్, ఎమ్మెల్యే అడ్లూరి


అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గంలో గుట్టుగా సాగుతున్న మట్టి దందా వెలుగుచూసింది. వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేట శివారులో నిల్వ ఉంచిన చెరువు మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటలకు జేసీబీ సహాయంతో మట్టిని లారీల్లో నింపి, పెద్దపల్లి జిల్లా గొరెడ్డిపేటకు తరలించే ప్రయత్నం చేస్తుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేశారు. అప్పటికే మట్టి నింపిన టిప్పర్ సహా 11 లారీలు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు వాహనాలను వదిలేసి, అప్పటికే పారిపోయారు. రెవెన్యూ అధికారులు ఆ వాహనాలను బుధవారం ఎస్సై ఉమాసాగర్‌కు అప్పగించగా వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్ల మట్టిని తన స్థలంలో నిల్వ ఉంచినందుకు పట్టాదారు తిరుపతి, మట్టిని అక్రమంగా నిల్వ ఉంచినందుకు రవీందర్, తరలించేందుకు ప్రయత్నించిన వెంకటేశ్వర్‌లపై తహసీల్దార్ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏడాది కిందే డంపుల ఏర్పాటు!

మట్టి డంపులను ఏడాది కిందటే ఏర్పాటు చేసినట్లు సమాచారం. కప్పారావుపేట చెరువు నుంచి మట్టి తీయడానికి 2022లో 3 రోజులకు అనుమతి తీసుకొని, రెండుచోట్ల డంపు చేశారు. కప్పారావుపేట శివారులో ప్రైవేటు వ్యక్తి పట్టా భూమిలో సుమారు ఎకరం విస్తీర్ణంలో 8 ఫీట్ల ఎత్తులో, కిషన్‌రావుపేట శివారులోని కొలకాని రాములు, తిరుపతి, రవిలకు చెందిన సర్వే నంబర్ 348/ఇ/1లో 1.24 ఎకరాల్లో 3 ఫీట్ల ఎత్తులో మట్టి నిల్వ చేశారు. మూడు రోజులుగా మట్టిని తరలిస్తుండగా స్థానికులు కొందరు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, మట్టి తరలించేవారు వారినే బెదిరించారని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు తాము లంచాలిచ్చేశామని బదులిచ్చినట్లు సమాచారం. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ దందా వెలుగుచూసింది.

పదేళ్లుగా అక్రమాలు..



ధర్మపురి నియోజకవర్గంలో పదేళ్లుగా కొందరు నల్లమట్టి, కంకర, గ్రానైట్ తదితర వ్యాపారాల్లో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులుంటే వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, పాత అనుమతులతో ఇప్పుడు అక్రమంగా వ్యాపారం చేస్తామంటే కుదరదు. రూ.కోట్ల స్కాం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. ఈ విషయమై విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తా. – విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్

దుబాయిలో విలాసాగర్‌వాసి మృతి

- రెండు రోజుల క్రితం గుండెపోటు
- పన్నెండేళ్లుగా అక్కడే..
- కూతుళ్ల పెళ్లికీ రాలే..
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు

బోయినపల్లి(చొప్పదండి): బతుకుదెరువు కోసం పన్నెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు.. కూతుళ్ల పెళ్లికీ రాలేదు.. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌కు చెందిన చల్ల శ్రీనివాస్(58) గ్రామంలో హమాలీ పని చేసేవాడు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో దుబాయి వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి స్వగ్రామానికి తిరిగి రాలేదు. కోవిడ్, వీసా సమస్యల వల్ల తన ఇద్దరు కూతుళ్ల


శ్రీనివాస్ (ఫైల్)

రవళి, రమ్య వివాహానికి సైతం రాలేకపోయాడు. మృతుడికి భార్య పద్మ ఉంది. ఆమె అప్పులు చేసి, కూతుళ్ల వివాహం జరిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందాడన్న విషయం దుబాయిలో ఉండే అతని బంధువు ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

విప్‌ను కలిసిన మృతుడి కుటుంబసభ్యులు

శ్రీనివాస్ మృతితో తాము దిక్కులేనివారమయ్యామని బాధిత కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు. తమకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి, ఆదుకోవాలని బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామం రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

కోనరావుపేట(వేములవాడ): భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.30 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన కంటె నరేశ్‌కు చందుర్తి మండలం అనంతపల్లికి చెందిన ఎక్కల రేవతి అలియాస్ శిరీషతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.10లక్షల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. వారికి ఒక కూతురు జన్మించింది. తర్వాత కొన్నాళ్లకు నరేశ్‌తోపాటు తల్లిదండ్రులు, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధించగా 2021 మార్చి 19న రేవతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం జిల్లా జడ్జి ప్రేమలత నరేశ్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు కింద దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కింద దూకి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడు(30) రైలు కింద దూకాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లేవు. తెలుపు చుక్కలున్న బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి, గడ్డంతో ఉన్నాడు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ సూచించారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

కోనరావుపేట(వేములవాడ): బైండోవర్ ఉల్లంఘించిన ఓ వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన అలిపిరి ఆదిరెడ్డి గతంలో తన ట్రాక్టర్ ద్వారా కనగర్తి మూలవాగు నుంచి పలుమార్లు ఇసుక అక్రమ రవాణా చేస్తూ అధికారులకు చిక్కాడు. తహసీల్దార్ ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో బైండోవర్ నిబంధన ఉల్లంఘించాడని జరిమానా విధించగా బుధవారం చెల్లించాడు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తల్లీపిల్లల అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్): తన భార్యాపిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సోమారంపేటకు చెందిన సూర రాజు బతుకుదెరువు కోసం తన భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలిసి జమ్మికుంట పట్టణంలోని మారుతీనగర్‌కు వచ్చాడు. స్థానికంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకొని, ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన అతను కూలీ పనికి వెళ్లి, ఇంటికి రాగా భార్యాపిల్లలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. పక్కింట్లో ఉంటున్న గుంజి నాగరాజు తీసుకెళ్లినట్లు తనకు అనుమానం ఉందని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోరుట్ల రూరల్: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ శివారు ఎస్సారెస్పీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామస్తులు బుధవారం కాల్వ వెంట వెళ్తుండగా అందులో మృతదేహం కనిపించింది. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని, బయటకు తీయించారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు దుస్తులు ధరించాడని, ఇతర ఏ ఆధారాలు లభించలేదని ఎస్సై పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు కోరుట్ల సీఐ నంబర్ 87126 56820 లేదా ఎస్సై నంబర్ 87126 56790కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి..

పెద్దపల్లిరూరల్: విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని కమాన్ రోడ్డు (పాత చిత్రాణి టాకీసు వద్ద) ప్రాంతానికి చెందిన కీర్తి శ్రీహర్ష(14) బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లి, ఇంటికి వచ్చాడు. బకెట్‌లో ఉన్న వాటర్ హీటర్‌కు విద్యుత్ సరఫరా ఉండటాన్ని గుర్తించకుండా పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కాసేపటికి గుర్తించిన తండ్రి రవికుమార్ కర్ర సాయంతో హీటర్‌ను తొలగించి, శ్రీహర్షను ఆస్పత్రికి తరలించాడు. కానీ, అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటిదాకా అందరితో కలివిడిగా ఉన్న శ్రీహర్ష మృతిచెందాడని తెలుసుకున్న కాలనీవాసులు కంటతడి పెట్టారు.


శ్రీహర్ష (ఫైల్)

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

- ఇరాక్‌లో గతేడాది డిసెంబర్ 29న రోడ్డు ప్రమాదంలో మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన వలసజీవి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మూడు నెలల తర్వాత ఆయన మృతదేహం స్వగ్రామం చేరింది. బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన బైరి వెంకటేశం(40) ఉపాధి నిమిత్తం 14 ఏళ్లుగా ఇరాక్ వెళ్తున్నాడు. గతేడాది డిసెంబర్ 29న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామం చేరగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సౌమ్య, కూతురు జాను, తల్లి బుచ్చవ్వ ఉన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ గల్ఫ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి వెంకటేశం కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


వెంకటేశం మృతదేహం

కుమారుడి చెంతకు తప్పిపోయిన వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తప్పిపోయిన ఓ వృద్ధుడు బుధవారం తన కుమారుడి చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లంతకుంట మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మెడకొక్కుల నర్సయ్య మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చి, తప్పిపోయాడు. స్థానిక బస్టాండ్ ప్రాంతవాసులు డే కేర్ సెంటర్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి, ఆయనను తీసుకెళ్లారు. కేంద్రం ఇన్‌చార్జి మమత నర్సయ్యకు భోజనం పెట్టించి, వివరాలు తెలుసుకోగా ఓబులాపూర్‌వాసినని చెప్పాడు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్‌కు ఫోన్ చేయగా నర్సయ్య కుమారుడిని పంపించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు వృద్ధుడిని అతని కొడుకుకు అప్పగించారు. డే కేర్ నిర్వాహకులకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


వృద్ధుడిని అప్పగిస్తున్న డే కేర్ సెంటర్ నిర్వాహకులు

వివాహిత ఆత్మహత్యాయత్నం

మల్యాల(చొప్పదండి): ఆత్మహత్య చేసుకునేందుకు వరద కాల్వలో దిగిన ఓ వివాహితను బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. బుధవారం మల్యాల మండల కేంద్రంలోని తన తల్లిగారి ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, బయలుదేరింది. మల్యాల అడ్డ రోడ్డు సమీపంలోని వరద కాల్వ వద్దకు చేరుకొని, అందులో దిగింది. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు వెంటనే వచ్చి, ఆమెను బయటకు తీసుకువచ్చారు. కాల్వలో నీరు తక్కువగా ఉండటంతో లక్ష్మి ప్రాణాలతో బయటపడింది.


బాధితురాలిని కాల్వలో నుంచి బయటకు తీసుకువస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులు

'ట్రినిటీ' విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్‌షిప్



కరీంనగర్‌రూరల్: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సూయి జనరిస్ ప్రోగ్రాంలో ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 14 రకాల ఈవెంట్లలో సత్తా చాటడంతోపాటు యాక్టివ్ పార్టిసిపేషన్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి బుధవారం అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, ఎంబీఏ హెచ్‌వోడీ ప్రవీణ్‌కుమార్, లెక్చరర్లు సంతోషి, రజితరెడ్డి, ఇలియాజ్ అలీ, అజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం
- భర్తే హత్య చేశాడని బంధువుల ఆందోళన
- డీఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

జగిత్యాలక్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఆమెను భర్తే హత్య చేశాడని పేర్కొంటూ బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాళ్ల సుధారాణి, గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఎల్లంకి రంజిత్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి హర్షవర్ధన్ (3) కుమారుడు సంతానం. భార్యాభర్తలు కొన్నాళ్లుగా జగిత్యాలలోని చిలుకవాడలో నివాసముంటున్నారు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4న హర్షవర్ధన్ పుట్టు వెంట్రుకలు తీసేందుకు నిర్ణయించారు. సంప్రదాయం ప్రకారం మేనమామ రావాల్సి ఉండగా.. రంజిత్ నిరాకరించాడు. దీంతో మరో సారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సుధారాణి బుధవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించేలోపే మృతిచెందింది. విషయం తెలుసుకున్న సుధారాణి కుటుంబ సభ్యులు, బంధువులు జగిత్యాలకు చేరుకుని సుధారాణి భర్త రంజిత్, అతని కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించారు. డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. తన కూతురును రంజిత్ కులం పేరుతో దూషించి మానసికంగా వేధించాడని, చివరకు హత్య చేశాడని మృతురాలి తల్లి కాళ్ల వసంత ఆరోపించింది. ఆమె ఫిర్యాదు మేరకు రంజిత్‌తోపాటు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.


సుధారాణి మృతదేహం

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు
- కరీంనగర్ జిల్లా వెదిర గ్రామంలో ఘటన

రామడుగు(చొప్పదండి): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామంలో ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. 12మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం గ్రామ పరిధిలోని మసుకుంట వైపువెళ్లే దారిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడికి దిగడంతో పరుగులు తీశారు. గ్రామానికి చెందిన మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, నిట్టు కవిత, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య, కొలిపాక సంపూర్ణ, లక్ష్మి, అమృత, పుల్ల మల్లవ్వ, ముత్త కనకయ్య, కుమ్మరి రమ్య, ఉపేంద్ర పైన తేనెటీగలు పెద్ద మొత్తంలో దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాధితులను రామడుగు తహసీల్దార్ భాస్కర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.


బాధితులను 108 వాహనంలో తరలిస్తున్న అధికారులు

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

ధర్మపురి: చైన్ స్నాచింగ్ ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలను ఆయన వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన అక్కల అంతమ్మ మార్చి 29న స్థానిక పెట్రోల్ బంక్ వద్ద దోసకాయలు విక్రయించేందుకు జాతీయ రహదారి పక్కన కూర్చుంది. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దోసకాయలు బేరం చేశారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తామని నమ్మించి, మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు ఐదు రోజులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. బుధవారం రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు, పుస్తె లభ్యమయ్యాయి. విచారణలో అయిలాపూర్‌కు చెందిన సిలిగిరి సందీప్, కోరుట్లకు చెందిన ముంజ రాజేందర్ చోరీ చేసినట్లు, మెట్‌పెల్లి మండలంలోని ఆరెపేటకు చెందిన అక్షయ్‌కుమార్, అతని భార్య అలేఖ్యలతో కలిసి వాటిని మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తేలింది.


అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జల్సాలకు అలవాటుపడే..

జల్సాల అలవాటుతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. గొలుసు చోరీ చేసిన మరుసటి రోజే విక్రయించడానికి బీర్పూర్ మండలానికి వెళ్లగా ఎవరూ కొనలేదన్నారు. దీంతో వారు మంచిర్యాలలో అమ్మేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. బంగారు గొలుసుతో పాటు ఒక గ్రాము పుస్తె, 3 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను త్వరగా పట్టుకున్న సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, సతీశ్, శ్రీధర్‌రెడ్డి తదితరులను ఎస్పీ అభినందించారు.

నకిలీ వీసాలతో మోసగించిన కేరళవాసి..

మెట్‌పల్లి(కోరుట్ల): దుబాయ్‌లో ఉద్యోగాల పేరిట నకిలీ వీసాలు ఇచ్చి, మోసం చేసిన కేసులో కేరళకు చెందిన మహమ్మద్ హాసిఫ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి కథనం ప్రకారం.. హాసిఫ్ గత జనవరిలో మెట్‌పల్లికి చెందిన ఏలేటి రమేశ్‌తో కలిసి ఈ ప్రాంతంలోని పలు వురికి దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.26,500 చొప్పున వసూలు చేశాడు. అనంతరం వీసాలు ఇవ్వగా వారు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడి అధికారులు పరిశీలించి, అవి నకిలీవని తేల్చారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. పోలీసులు గత ఫిబ్రవరిలో రమేశ్‌ను అరెస్ట్ చేశారు. బుధవారం హాసిఫ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.


హాసిఫ్ అరెస్టు చూపుతున్న పోలీసులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి..

కోరుట్ల రూరల్: పట్టణంలోని హాజీపురకు చెందిన మహమ్మద్ షబ్బీర్‌ను గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ సురేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణ శివారులోని వెటర్నరీ విశ్వవిద్యాలయం వద్ద ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో షబ్బీర్ బైక్‌పై నిజామాబాద్ నుంచి కోరుట్లకు గంజాయి తీసుకువస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 210 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. షబ్బీర్ కోరుట్ల పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నాడని తెలిపారు. ఎస్సైని, సిబ్బందిని అభినందించారు. సీఐ వెంట ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులున్నారు.


అరెస్టు చూపుతున్న సీఐ సురేశ్‌బాబు